క్లుప్తంగా

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత


పల్లకి సేవలో బీజేపీ జిల్లా నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి

జైనథ్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తోందని బీజేపీ జిల్లా నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని పిప్పల్‌గాంలో నిర్వహిస్తున్న భవ్యజ్ఞానేశ్వరి సప్తాహ వేడుకలకు మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాజీరావు బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా పూజలు నిర్వహించారు. బాబా పల్లకిసేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కంది శ్రీనివాసరెడ్డిని పూలమాల శాలువాతో సత్కరించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగర్‌కర్ శంకర్, కిష్టారెడ్డి, మారుతి, సంతోష్‌రెడ్డి, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బేల: సిర్సన్న గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా సప్తాహం ముగింపు వేడుకలను నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ప్రధాన వీధులగుండా బాబా చిత్రపటంతో, చిన్నారులను దేవతల రూపంలో అలకరించి పల్లకీ ఊరేగింపు చేపట్టారు. చివరగా కాల దహీ హండిని చేపట్టి, అన్నదానం నిర్వహించారు. బీజేపీ జిల్లా నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి, పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జిల్లా నాయకులు


పాల్గొన్న ఎంపీ, నాయకులు

ఆదిలాబాద్: మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జిల్లా పార్టీ నేతలు పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అధ్యక్షతన ప్రారంభమైన ఈ సమావేశాలు మంగళవారం రెండో రోజు చేరుకోగా, జిల్లా నుంచి ఎంపీ సోయం బాపురావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్ ఠాక్రే, ఎన్నాల నగేశ్, నాయకులు పాల్గొన్నారు.

సన్మానం


సుదర్శన్‌ను సన్మానిస్తున్న జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు వనజ

నేరడిగొండ: మహిళల అభ్యున్నతి కోసం ఐకేపీ ఏపీఎం సుదర్శన్ ఎంతగానో కృషి చేశారని జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు వనజ అన్నారు. బదిలీపై నిర్మల్ జిల్లాకు వెళ్లిన ఐకేపీ ఏపీఎం సుదర్శన్‌ను మంగళవారం మండల కేంద్రంలోని భవిత మండల సమాఖ్య కార్యాలయంలో సన్మానించారు. ఐబీ డీపీఎం హేమలత, ఏపీఎం కిరణ్, జిల్లా సమాఖ్య కార్యదర్శి ప్రేమలత, సిరికొండ ఐకేపీ ఏపీఎం సంతోష్, టీజీబీ మేనేజర్ సత్యనారాయణ, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ చిరంజీవి, ఐకేపీ ఇన్‌చార్జి ఏపీఎం లింగరాజు పాల్గొన్నారు.

చిరుధాన్యాల పంటలకు ప్రోత్సాహం


ర్యాలీలో పాల్గొన్న ఏవో ప్రమోద్‌రెడ్డి

బజార్‌హత్నూర్: చిరుధాన్యాల పంటల సాగుకు వ్యవసాయశాఖ ప్రోత్సాహం అందిస్తోందని ఏవో ప్రమోద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చందునాయక్‌తాండ గ్రామంలో మంగళవారం ఆయన మాట్లాడారు. 2023ను వ్యవసాయశాఖ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందన్నారు. రైతులు ఇతర పంటలు కాకుండా చిరుధాన్యాలు సాగు చేసి లాభాలు పొందాలని సూచించారు. అనంతరం రైతులతో కలిసి గ్రామ వీధుల గుండా చిరుధాన్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ అనితకవీందర్, ఏఈవో రాజేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌పై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పరిమితికి మించి ప్రయాణికులను తరలించిన ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై ఊశన్న తెలిపారు. మంగళవారం ఉదయం పట్టణంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కుమలాపూర్‌కు చెందిన రవీందర్ ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఆయనపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

బస్టాండ్ లేక తిప్పలు

- బస్సు కోసం రోడ్డుపైనే పడిగాపులు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు


బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

నేరడిగొండ: మండల కేంద్రంలో బస్టాండ్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లుగా మండల, పరిసర గ్రామాల ప్రయాణికులు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ, చలికి వణుకుతూ అనేక ఇక్కట్లు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే నేరడిగొండ కూడళ్లలో బస్టాండ్ నిర్మాణానికి స్థలం లేదు. దీంతో ప్రయాణికుల కల నెరవేరడం లేదు. తప్పని పరిస్థితుల్లో అక్కడే ఉన్న దుకాణాలు, హోటళ్ల నీడన నిలబడి బస్సుల రాక కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. జాతీయ రహదారి ఉండడంతో నిర్మల్, ఆదిలాబాద్‌కు ఈ రహదారి గుండానే నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దీనికితోడు రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్లు నిర్మించినా.. కూర్చోవడానికి బస్టాండ్ లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

పల్లెలకు కానరాని బస్సులు

మండలంలో 32 పంచాయతీలు ఉండగా, చాలా గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. జాతీయ రహదారి గుండా ఉన్న గ్రామాలకు మినహా ఏ గ్రామాలకు బస్సులు వెళ్లడం లేదు. అయితే గతంలో మండల కేంద్రం నుంచి వడూర్, బొందిడి గ్రామం వరకు 12 ట్రిప్పులను బస్సు నడిపించారు. ప్రయాణికులు ప్రైవేట్ వాహనాల్లో ఎక్కడంతో బస్సు ట్రిప్పులను మొత్తానికే నిలిపివేశారు. అలాగే మండల కేంద్రం నుంచి కుంటాల జలపాతం వరకు తారు రోడ్డు ఉంది. ఆ దారిగుండా బస్సు సౌకర్యం ఉంటే వివిధ గ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది. కుమారి మీదుగా బోథ్ మండలం కౌఠ, బోథ్ మీదుగా వెళ్తే పలు గ్రామాలకు బస్సు సౌకర్యం ఉంది.

ప్రమాదాలకు నెలవు

మండల కేంద్రం గుండా జాతీయ రహదారి వెళ్తుండడంతో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. దీనికి తోడు ఇరువైపులా వాహనాలు నిలపడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేసే అధికారులు అనంతరం పట్టించుకోవడం లేదని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బస్టాండ్ నిర్మించాలి



మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మించాలి. బస్టాండ్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. బస్సుల కోసం గంటల తరబడి రోడ్లపై నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. వృద్ధులు, చిన్నారులు, మహిళల పరిస్థితి మరీ దారుణం. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి. – జాదవ్ మంగు, బోరిగాం

ఇబ్బందులు పడుతున్నాం



వివిధ ప్రాంతాలకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఇక్కడ కనీసం నిల్చోవడానికి కూడా స్థలం లేక అవస్థలు పడుతున్నాం. వేసవి, వర్షాకాలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. నూతన బస్టాండ్ నిర్మించేందుకు కృషిచేయాలి. – సాబ్లే ప్రతాప్ సింగ్, నేరడిగొండ

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి


మానవహారంగా ఏర్పడ్డ విద్యార్థులు

- డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డీఈవో ప్రణీత అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మంగళవారం పోలీసు శాఖతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. కుమురంభీం చౌక్‌లో విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. అనంతరం ర్యాలీగా కలెక్టరేట్ వరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ బాలిక విద్యపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆడ, మగ అనే తేడా లేకుండా సమానంగా చూడాలన్నారు. ఆడవారు సైతం మగవారికి దీటుగా అన్నిరంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. అనంతరం అర్బన్ కేజీబీవీలో కరాటే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు ఉదయశ్రీ, సుజాత్ ఖాన్, డీసీపీవో రాజేంద్ర ప్రసాద్, చైల్డ్‌లైన్ అధికారి తిరుపతి, షీటీమ్ ఇన్‌చార్జి సునీత, కేజీబీవీ ప్రత్యేక అధికారులు దీప్తి, కవిత, రజిని, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టాఫీస్ సిబ్బంది

తాంసి: పోస్టల్ ద్వారా అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ డివిజన్ మెల్‌వర్చల్ అధికారి భరత్ కోరారు. మండల కేంద్రంలో పోస్టల్ సేవలపై సిబ్బందితో కలిసి మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ సుకన్య సమృద్ధి యోజన, తపాలా జీవిత బీమా, అటల్ పెన్షన్, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆధార్ మినీ ఏటీఎం ద్వారా ఎలాంటి చార్జీలు లేకుండా డబ్బులు తీసుకోవచ్చని తెలిపారు. పోస్టాఫీస్ మేనేజర్ వెంకట్‌రెడ్డి, బీపీఎంలు పోతన్న, సురేష్, కిష్టు, సిబ్బంది గంగారాం, ప్రవీణ్ పాల్గొన్నారు.

పుర ప్రజావాణికి 29 అర్జీలు

- దరఖాస్తులు స్వీకరించిన కమిషనర్


అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ శైలజ

ఖైలాస్‌నగర్: ఆదిలాబాద్‌లోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన పుర ప్రజావాణికి స్పందన లభించింది. తమ సమస్యలను నివేదించేందుకు వివిధ కాలనీలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. బాధితుల అర్జీలను మున్సిపల్ కమిషనర్ ఏ.శైలజ స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాల్సిందిగా సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. ఈ వారం వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 29 అర్జీలు అందాయి. ఇందులో టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి పది, రెవెన్యూ 12, ఇంజనీరింగ్ 07, శానిటేషన్ విభాగానికి సంబంధించి 2 అర్జీలు అందాయి. వీటిని ఆయా విభాగాల అధికారులకు అందజేస్తూ వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. కాగా గత వారం అందిన 27 అర్జీలను పరిష్కరించినట్లుగా చైర్మన్ వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ దివాకర్, డీఈలు తిరుపతి, యూనుస్, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, ఆర్ఓలు జాదవ్ కృష్ణ, నితిన్, టీపీఎస్ అనురాధ, ఎస్సై నరేందర్, ఆర్ఐ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి


జిల్లాకేంద్రంలో పూజలు చేస్తున్న నాయకులు


బేలలో పూజలు చేస్తున్న పద్మశాలీలు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో మార్కండేయ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీపీ మంచికట్ల ఆశమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్కండేయ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అర్హులైన పద్మశాలీలకు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలను అందించాలన్నారు. సంఘం తాలుకా అధ్యక్షుడు బొమ్మకంటి రమేశ్, ఉపాధ్యక్షుడు అనుముల ఊషన్న, ఆత్మ చైర్మన్ జిట్ట రమేశ్, ఆదిలాబాద్ రూరల్ మండల అధ్యక్షుడు అనుముల ఊషన్న, గౌరవ అధ్యక్షుడు జక్కుల సత్యనారాయణ, సోషల్ మీడియా కన్వీనర్ కుర్ర నరేశ్, నాయకులు నర్సింగ్‌రావ్, జక్కు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యాపల్‌గూడలో పల్లకీ ఊరేగింపు..

ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడలో ప్రధాన వీధుల గుండా మార్కండేయ పల్లకీని ఊరేగించారు. ఎంపీపీ గండ్రత్ రమేశ్, సర్పంచ్ గంగారాం, గ్రామపటేల్ నారాయణ, నాయకులు జైరాం, జయంత్, నాగన్న, నవీన్, భూమన్న, మహిళలు పాల్గొన్నారు.

నేరడిగొండ/బోథ్: నేరడిగొండ మండలం వడూర్‌లోని శివలింగేశ్వర ఆలయంలో, బోథ్ మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో జరిగిన జయంతి వేడుకలు జరిగాయి. మార్కండేయ చరిత్ర శ్లోకాలను పఠించారు. పద్మశాలీలు తదితరులు పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని మార్కెట్ కూడలిలో మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ చిత్రపటానికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు దంతెల వినోద్, చంద్రశేఖర్, శ్యామన్న, నరేశ్, కట్కం సాయి, దిగాంబర్, కృష్ణ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌హెచ్‌ఎస్‌ఎస్ మండల అధ్యక్షుడిగా సునీల్


సునీల్

బేల: మండలంలోని సాంగిడి గ్రామానికి చెందిన రైతు సిద్రపు సునీల్‌ను తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి(టీఆర్‌హెచ్‌ఎస్‌ఎస్) మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ యాదవ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ మంగళవారం ప్రకటించారు. త్వరలో మిగతా కార్యవర్గ సభ్యులను ఎన్నుకుంటామని పేర్కొన్నారు. రైతాంగం సమస్యల పరిష్కారానికి ఈ సంఘం పనిచేస్తోందని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్‌రెడ్డి, నాయకులు ఉషన్న, బండి నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ నూతన కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గసభ్యులు

జైనథ్: మండల ఆర్‌ఎంపీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చట్ల కృష్ణ, ఉపాధ్యక్షుడిగా గండ్రత్ గణేశ్, ప్రధాన కార్యదర్శిగా గడుగు సురేందర్, కోశాధికారిగా టాక్రే సతీశ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఆర్‌ఎంపీల సంక్షేమానికి అన్ని విధాలుగా కృషి చేస్తామన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న ఎంపీపీ దర్శనాల సంగీత ఏవన్

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మావల ఎంపీపీ దర్శనాల సంగీత ఏవన్ అన్నారు. మావల ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మావల మండలంలో మూడు పంచాయతీలే ఉన్నాయని, విస్తీర్ణంలో కూడా చిన్నగా ఉందన్నారు. అధికారులు మండల ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరమయ్యేలా చూడాలన్నారు. అధికారులతో సమస్య పరిష్కారం కాకపోతే పాలకవర్గం, ఎమ్మెల్యే జోగు రామన్న దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జెడ్పీటీసీ నల్ల వనిత, వాఘాపూర్ ఎంపీటీసీ చందాల ఈశ్వరి రాజన్న, ఎంపీడీవో అరుణ, తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీవో లక్ష్మణ్, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్


మాట్లాడుతున్న జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్: ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఫొటోగ్రాఫర్లకు కావాల్సిన సంఘ భవన స్థలం కేటాయింపు విషయాన్ని ఎమ్మెల్యే జోగు రామన్న దృష్టికి తీసుకెళ్తామన్నారు. త్వరలో ఇంటి స్థలాలు కేటాయించేలా చూస్తామని హామీ ఇచ్చారు. సంఘం అభివృద్ధికి రూ.25 వేలు సభ్యులకు అందించారు. అంతకు ముందు కెమెరా ఫొటోగ్రఫీ సృష్టికర్త లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేశారు. కాగా ప్రమాణ స్వీకారం చేసిన నూతన కార్యవర్గ సభ్యులను మున్సిపల్ చైర్మన్ సన్మానించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, సంఘం మాజీ కోశాధికారి మధు, భూపాల్, జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు దోడ అశోక్, ప్రవీణ్ కుమార్, హరికృష్ణ, సంతోష్ కుమార్, విశాల్, గౌరవ సభ్యులు మురళీధర్ అహుజా, సుధీర్, రఘునాథ్ పాల్గొన్నారు.

గొర్రె కాపరుల కార్యవర్గం


నియామకపత్రాలు అందజేస్తున్న విక్రాంత్

తాంసి: తాంసి గ్రామ గొర్రె కాపరుల సంఘం నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాడిగిరి సుధాకర్ యాదవ్, కార్యదర్శిగా నవీన్, కోశాధికారిగా సురేశ్‌తోపాటు సభ్యులను ఎనుకున్నారు. ఎన్నికల అధికారి విక్రాంత్ వారికి నియామక పత్రాలు అందజేశారు. సంఘం సభ్యులు రాకేశ్‌యాదవ్, రాము, బాలక్రిష్ణ, కిసాన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి)లో హిందు సహాయక సమితి కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సర్పంచ్ అడవ్ మారుతి తెలిపారు. అధ్యక్షుడిగా మాధవ్‌రావు, ఉపాధ్యక్షుడిగా ప్రకాశ్, సభ్యులుగా దేవ్‌రావు, రాంచందర్, ఉత్తమ్, రాంచందర్, సాయిలను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి


విద్యార్థినులతో బలరాం జాదవ్

జైనథ్: బాలికలు అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో మంగళవారం నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాగా చదివి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. సెక్టోరల్ అధికారి ఉదయశ్రీ మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినుల నాటికలు ప్రదర్శించడంతోపాటు వేసిన ముగ్గులను సందర్శించారు. కాగా ఆడపిల్లలు ఎదుర్కొంటున్న వివక్షతల గురించి వారు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వీరికి డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరి నగదు బహుమతులు అందజేశారు. కేజీబీవీ ప్రత్యేక అధికారి కె.వీణాకుమారి, పాఠశాల పీజీసీఆర్టీలు, సీఆర్టీలు, నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేరడిగొండ: జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండలంలోని లఖంపూర్ బాలికల గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలను తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలు జాతీయ శక్తిగా ఎదగాలని, నేటి బాలికలే రేపటి వీరవనితలని పేర్కొన్నారు. 3 నుంచి 10వ తరగతి వరకు ఉత్తమ విద్యార్థినులకు బహుమతులు అందజేసి వారిని ప్రశంసించారు. సర్పంచ్ జంగు, తపస్ మండల అధ్యక్షుడు రాథోడ్ ఉత్తమ్, పాఠశాల వార్డెన్ విజయ కుమారి, పీడీ రాధ ఉన్నారు.

ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డికి సన్మానం


సన్మానిస్తున్న సంఘం నాయకులు

నేరడిగొండ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డిని పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. మండల కేంద్రానికి చేరుకున్న ఆయనను మంగళవారం శాలువతో సత్కరించారు. సంఘం బాధ్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల కోసం ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు.

అంధత్వ నివారణ కోసం కృషిచేయాలి


కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

ఇచ్చోడ: అంధత్వ నివారణ కోసం రాష్ట్రప్రభుత్వం కంటి వెలుగు శిబిరాలు నిర్వహిస్తోందని ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల కేంద్రంలో ఈ శిబిరం దాదాపు 45 రోజులు కొనసాగుతందన్నారు. ఇచ్చోడ పీహెచ్‌సీ వైద్యాధికారి సాగర్, సర్పంచ్ సునీత, ఎంపీటీసీ శివకుమార్‌రెడ్డి, పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

నేరడిగొండ: ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. మండలంలోని బొందిడితోపాటు వడూర్ గ్రామంలోని 3వ అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆరు నెలల బాబుకు అన్నప్రాసన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణి, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తోందన్నారు. కార్యకర్త అనసూయ, రమ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు పరిశీలన

సిరికొండ: మండలంలోని కొండాపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద మంగళవారం పరిశీలించారు. కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవానికి ఆహ్వానం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును మంగళవారం ఆలయ కమిటీసభ్యులు ఆహ్వానించారు. గురువారం నిర్వహించే వార్షికోత్సవానికి హాజరుకావాలని కోరారు.